‘మాయమాటల మోసగాడు కేసీఆర్’


నాచారంలో బీజేపీ కార్నర్ మీటింగ్‌లో విజయరామారావు



ఉప్పల్ కచ్చీర్ స్కూల్ వద్ద మాట్లాడుతున్న ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టి పాలన చేయడంలో కేసీఆర్‌ను మించిన మోసగాడు ఎక్కడ ఉండరని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ విజయరామా రావు అన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి పాదం వెంకటేష్ ఆధ్వర్యంలో నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, అనితారెడ్డి, గంధమళ్ల గోపీ, చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి, సాయిగౌడ్, రవికాంత్, నిర్మల పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

మల్లాపూర్: తెలంగాణ సాధించుకున్న తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని, ప్రజలు ఆశీర్వదిస్తే వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేనావత్ రవి నాయక్ అన్నారు. గురువారం రాత్రి మల్లాపూర్ న్యూభవానీనగర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, రంగు మల్లికార్జున్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్ట్రీట్ కార్నర్ సమావేశానికి హాజరైన భానుప్రకాష్

రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉప్పల్ కచ్చీర్ స్కూల్ వద్ద ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో మహంకాళి లక్ష్మణ్, సింగారం కార్తీక్, తీగ విఠల్, దేవేందర్‌రెడ్డి, డా.శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

అల్వాల్: రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగిస్తోందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ అన్నారు. అల్వాల్‌లోని గోపాల్‌నగర్‌లో శుక్రవారం స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు సిద్ధేశ్వర్‌కు డాక్టరేట్



హబ్సిగూడ: మెగా, ఒమెగా విద్యాసంస్థల అసోసియేట్ ప్రొఫెసర్ యు.సిద్ధేశ్వర్ జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుంచి మ్యాథమెటిక్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన సిద్ధేశ్వర్ ‘ఏ సైబర్ సెక్యూరిటీ మ్యాథమెటికల్ మోడల్ అప్రోచ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్‌మెంట్’ అనే అంశంపై ప్రొఫెసర్లు డాక్టర్ జీవీ.సుబ్బారావు, డాక్టర్ విశ్వజిత్ గోస్వామి పర్యవేక్షణలో పూర్తి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర జేఏసీ సభ్యుడిగా పని చేశారు. ఆయనకు డాక్టరేట్ రావడంపై తెలంగాణ ఉద్యమకారులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వ్యక్తిపై కుక్క దాడి



బోడుప్పల్: పాపను పాఠశాలకు తీసుకెళ్తుండగా ఓ వ్యక్తిపై కుక్క దాడి చేసిన ఘటన శుక్రవారం బోడుప్పల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి వివరాల ప్రకారం బోడుప్పల్ మల్లయ్యనగర్ కాలనీ వీధి నంబర్– 5లో రాజు(30) కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై పాపను స్కూల్‌కు తీసుకెళ్తుండగా కుక్క వెంబడించి కరిచింది. దీంతో రాజు కాలి మడమ వద్ద రెండు గాట్లు పడ్డాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్స్ షో

హబ్సిగూడ: హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో శుక్రవారం నిర్వహించిన మైన్ డైమండ్స్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మోడల్స్ పలు మోడళ్లను ప్రదర్శించారు. రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నట్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ హబ్సిగూడ స్టోర్ హెడ్ అహ్మద్ సోఫీ అన్నారు. వచ్చేనెల 6వ తేదీ వరకు షో కొనసాగుతుందన్నారు. షాలిని మీనన్, సుదీక్ష, షాలిని పాండే పాల్గొన్నారు.



బోడుప్పల్‌లో దోమల బెడద



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. సాయంత్రం 6 గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి. దీంతో నగర ప్రజలు చీకటి పడిన తర్వాత బయటకు రావాలంటే జంకుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఓపెన్ డ్రైన్లు ఉండటం, కొన్ని కాలనీల్లో చెత్త చెదారం పేరుకుపోవడం, ఖాళీ స్థలాల్లో కాలనీవాసులు వ్యర్థాలు, చెత్త చెదారం వేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల స్వైరవిహారాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు, పాలకవర్గం వాటి నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో సరిగ్గా బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, చెరువులు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయకపోవడం, వీధుల్లో స్ప్రేయింగ్ మిషన్లతో పిచికారీ చేసి దోమలు వృద్ధి చెందకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న దోమల వల్ల కాలనీవాసులు డెంగీ, మలేరియాతో పాటు ఇతర వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, పాలకవర్గం చొరవ తీసుకుని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కుషాయిగూడ: పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్న ముఠాను పోలీసులు గుర్తించి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రేషన్ అక్రమ వ్యాపారంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న కుషాయిగూడ పోలీసులు చర్లపల్లి, బీఎన్‌రెడ్డినగర్‌లోని రేషన్ బియ్యం భద్రపరిచిన స్థావరంపై ఆకస్మిక దాడులు చేశారు. మల్కాజిగిరికి చెందిన ఎండీ ఫరూక్ అబ్దుల్‌తో పాటు ఖాజాపాషాలు అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి 89 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షఫీ తెలిపారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లోని చాకలిబస్తీలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో సీవరేజి వాటర్ లైన్, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అంశాలను గుర్తించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


చాకలిబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

పనిచేసే ప్రదేశాల్లో లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

అల్వాల్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాచకొండ అదనపు డీసీపీ నర్మద సూచించారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఉమెన్స్ ఫోరం ఆధ్వర్యంలో పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల రక్షణ కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ మహిళా సిబ్బందికి శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ నర్మద మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలకు ఎదురయ్యే వివిధ రకాల వేధింపుల పట్ల పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలని వివరించారు. మహిళలను మాటలు, చేతలు, మరే ఇతర మార్గాల ద్వారా లైంగికంగా వేధించేవారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన వారు 3 నెలలలోపు వరకు ఫిర్యాదు చేసే అవకాశం కలిగి ఉంటుందన్నారు. బాధితురాలు స్వయంగా ఫిర్యాదు చేయలేని పరిస్థితుల్లో ఉంటే వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో కలెక్టివ్ స్థాపకురాలు భూమిక, సత్యవతి, సావిత్రితో పాటు వివిధ సంస్థల మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీస్సులు


నూతన దంపతులకు ఆశీర్వదిస్తున్న రేవంత్‌రెడ్డి

అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ కూతురి వివాహం ఇటీవల జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా అల్వాల్‌లోని నందికంటి శ్రీధర్ నివాసానికి శుక్రవారం హాజరై నూతన దంపతులు రాజరాజేశ్వరి, రోహిత్‌లను ఆయన ఆశీర్వదించారు.


వధూవరులకు ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హబ్సిగూడ: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వనంపల్లి గోపాల్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, బాలరాజు, నవీన్, చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రీతికి న్యాయం జరిగే వరకూ పోరాటం



రామంతాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

రామంతాపూర్: పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యయత్నం చేసుకునే విధంగా ర్యాగింగ్‌కు పాల్పడి మానసిక వేదనకు గురిచేసిన సీనియర్ వైద్య విద్యార్థి షఫీని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం రామంతాపూర్ జాతీయ రహదారిపై ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. బాధ్యతారహితంగా వ్యవహరించిన కేఎంసీ కళాశాల మేనేజ్‌మెంట్ ఎంజీఎం ఆస్పత్రి సూపరిండెంటెండ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం పోలీసులు ఏబీవీపీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఎల్బీనగర్ విభాగ్ కన్వీనర్ శ్యామ్, వర్కింగ్ కమిటీ సభ్యులు మహేష్, దీప్తి, మనోహర్, అఖిల్, సాయిరాం, సిద్ధార్థ, కార్తీక్, నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే.. ప్రమాదాలకు చెక్

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు



అల్వాల్: వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం కానాజీగూడలోని నారాయణ విద్యా భవన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లపై జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను వారు నివృత్తి చేశారు. నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు పూర్తిస్థాయిలో ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. మార్కెట్ రోడ్డు, సిల్వర్‌సీగల్లీ, సుక్కమ్మ కుంట, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, సిటిజెన్ కాలనీ, ముత్తుస్వామి కాలనీ, సుష్మితనగర్, ఆనంద్‌నగర్, మోహన్‌రావు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వీరభద్ర కాలనీలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదని వారు తెలిపారు.

చిల్డ్రన్స్.. భౌభౌలతో బీకేర్‌ఫుల్..

పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: వీధి కుక్కలను చూసి పరిగెత్తడం, అరవడం, భయపడటం వంటివి చేస్తే అవి దాడి చేసే ప్రమాదం ఉందని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. పర్వతాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుక్కలను నియంత్రించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆయన వివరించారు. కుక్కలు బెదిరిపోయినప్పుడు దాడి చేయడం, కాటు వేయడం చేస్తాయని అన్నారు. కుక్కలను చూసి పరిగెత్తకూడదని, బెదిరిపోయి అరవకూడదని, అలాగే నిలబడి అవి వెళ్లిపోయిన తర్వాత వెళ్లాలని పిల్లలకు సూచించారు. రోడ్డుపై ఉన్న కుక్కలపై రాళ్లు విసరడం వంటి పనులు చేయవద్దని అన్నారు. నగర పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి వాటికి వ్యాక్సిన్ వేయడం, స్టెరిలైజ్, కు.ని.ఆపరేషన్లు క్రమంతప్పకుండా చేస్తున్నామని అన్నారు. కుక్కకాటుకు గురైనప్పుడు అవసరమైన రేబీస్ వ్యాక్సిన్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. వీధి కుక్కలకు ఆహారం, నీరు అందించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణాగౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జానకి, నాయకులు బొడిగె కృష్ణాగౌడ్, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

యువకుడికి ఆర్థిక సాయం



మౌలాలి: మౌలాలి డివిజన్ భరత్‌నగర్‌కు చెందిన సాయికి ఫిజియోథెరపీ చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్(ఎంఎస్ఎస్‌వో) ద్వారా రూ.18 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్, జానీసాగర్, బాలస్వామి, రాజురాందాస్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కేబుల్ వైర్లు దగ్ధం



మల్లాపూర్: మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో గాంధీ విగ్రహం సమీపంలో ఉదయం 7 గంటలకు ఓ విద్యుత్ స్తంభంపై నిప్పురవ్వలు ఎగిసిపడి వైర్లు కాలిపోయాయి. స్తంభానికి పెద్దఎత్తున ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీంతో ఓల్డ్ విలేజ్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సాయన్న స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలి


అల్వాల్‌లోని జేఏసీ శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అల్వాల్: దివంగత ఎమ్మెల్యే సాయన్న పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించిందని పలువురు నాయకులు విమర్శించారు. అల్వాల్ జేఏసీ శిబిరం వద్ద శుక్రవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల పాటు ప్రజలకు సేవలు అందించిన దివంగత ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. దళితుల పట్ల వివక్షత చూపుతున్నారు అనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. బడుగు బలహీన వర్గాలకు సాయన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎటువంటి అవినీతి ఆరోపణలు లేని నాయకుడన్నారు. ఇప్పటికైనా ఆయన సేవలు నిరంతరం ప్రజలకు గుర్తుండేలా స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గద్దం శ్రీనివాస్, శ్రీరాములు, రమేష్, అశోక్, సురేందర్‌రెడ్డి, దయాకర్, దండుగుల వెంకటేష్, భాస్కర్, బచ్చలకూర స్వామి, రాంబాబు, మధుసూదన్, ఆనంద్, విజయ్, శంకర్, సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రూ.8 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ పనులు


పీర్జాదిగూడ పెద్ద చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకోనుంది. దాదాపు రూ.8 కోట్లతో చేపట్టే మినీ ట్యాంక్‌బండ్ బ్యూటిఫికేషన్ పనులను శుక్రవారం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అలువాల సరిత దేవేందర్ గౌడ్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల సుందరీకరణలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వివిధ పండగలు జరుపుకునే విధంగా స్వాగత తోరణం, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, ఓపెన్ ఎయిర్ జిమ్, వ్యూ పాయింట్, వాకింగ్ ట్రాక్, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. వివిధ రకాల పూలమొక్కలతో గార్డెన్ ఏర్పాటుతో పాటు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ ఈఈ పద్మ, ఏఈ శివారెడ్డి, పీఎంసీ డీఈ ఈ.శ్రీనివాస్, నాయకులు అలువాల దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో బ్యాక్‌లాగ్స్ ఉండటంతో..

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


సాయిప్రణీత్‌రెడ్డి (ఫైల్)

జవహర్‌నగర్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం.. ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో నివసించే కైపా శ్రీనివాస్‌రెడ్డి ప్రైవేట్ ఉద్యోగి. ఈయన భార్య కైపా శిరీషారెడ్డి కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు. వీరి కుమారుడు సాయి ప్రణీత్‌రెడ్డి(22) దూలపల్లిలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. కానీ ఇంజినీరింగ్‌లో బ్యాక్‌లాగ్స్ మిగిలే ఉన్నాయి. శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగానికి, శిరీషారెడ్డి ఓ వివాహానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో తన పడక గదిలో సాయి ప్రణీత్‌రెడ్డి టవల్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి తిరిగివచ్చిన తండ్రి ఇంటి తలుపులు తట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా ఉరి వేసుకొని కనిపించడంతో ఇంటి తలుపులు బద్దలు కొట్టి సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే అతడు మృతి చెందారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏకైక కుమారుడు మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వలస కార్మికులకు భద్రత కరువు


చర్లపల్లి పారిశ్రామికవాడలో కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న సీఐటీయూ నేతలు

కుషాయిగూడ: ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వలస వచ్చిన కార్మికులకు కనీస భద్రత కరువైందని, సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు వారి వెతలను కార్మిక నాయకుల ముందుంచారు. వారికి కనీస వసతులను కల్పించడంలో యజమాన్యాలు పూర్తిగా విఫలమవుతున్నాయని తెలిపారు. ఇరుకైన షెడ్‌లలో 15–20 మంది కార్మికులను పశువుల కొట్టంలో మాదిరి ఉంచడం బాధాకరమన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు వంటి కార్మికుల హక్కులను అమలు చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల హక్కులను హరిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వలస కార్మికుల సమస్యలపై 1వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.